క్లుప్తంగా

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మధిర: అగ్నిప్రమాదాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధిర అగ్నిమాపక కేంద్రం అధికారి వై.వెంకటేశ్వరరావు తెలిపారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం జిలుగుమాడు గ్రామంలో అగ్ని ప్రమాదాలు జరిగే సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్యాస్ లీక్ అయినప్పుడు, మంటలు వ్యాపిస్తున్న సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలలో వేడుకలు



కందుకూరి, సర్వేపల్లి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కొణిజర్ల: మండలంలోని బస్వాపురంలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో సోమవారం ప్రముఖ సంఘ సంస్కర్త రచయిత కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి, మాజీ ఉపరాష్ట్ర పతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలలేసి ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.కృష్ణారావు, డిప్యూటీ వార్డెన్ బి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు టి.మురళీధర్, నెహ్రూ, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

చింతకాని: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై పొదిల వెంకన్న తెలిపారు. మండలంలోని మత్కేపల్లి గ్రామంలో సైబర్ నేరాలపై సోమవారం రాత్రి చింతకాని పోలీసులు ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సైబర్ మోసానికి గురైన వ్యక్తులు వెంటనే స్థానిక పోలీసులకు, 1930 నంబరుకు డయల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్ కొండలరావు, ఏఎస్సై వెంకటేశ్వర్లు, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సురేష్, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

తల్లాడ: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ప్రజాపంథా నాయకుడు షేక్ లాల్‌మియా అన్నారు. మండలంలోని కేశ్వాపురంలో సోమవారం ఇంటింటా సర్వే చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల స్థలం లేని పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, రూ.10 లక్షలతో ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పర్ల సాతనేలు, కుమారి, నరేష్, సౌజన్య పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

తల్లాడ: మదర్ థెరిస్సా హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. తల్లాడ మేజర్ పంచాయతీ సర్పంచ్ నేరెళ్ల విశ్వనాథం చలివేంద్రాన్ని సరికొండ పాండురాజు కాంప్లెక్స్ నందు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కొత్తూరు ఫణి, అంబేడ్కర్ కమిటీ సభ్యులు, మదర్ థెరిస్సా హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

ఏన్కూరు: విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలని ప్రధానోపాధ్యాయుడు ఎస్.జాన్ కోరారు. మండలంలోని తూతకలింగన్నపేట ప్రాథమిక పాఠశాలలో సోమవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు టి.వెంకటేశ్వర్లు, శౌరి, సత్యావతి పాల్గొన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

మధిర: మధిర పట్టణంలోని ప్రభుత్వ సివిల్ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. బీజేపీ మధిర నియోజకవర్గం కన్వీనర్ ఏలూరి నాగేశ్వరరావు, విజయలక్ష్మి దంపతుల వివాహ వార్షికోత్సవ సందర్భంగా సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి విజయరాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి సాంబశివరావు, బీజేపీ పట్టణ, మండల అధ్యక్షులు రమేష్, చంద్రశేఖర్ రెడ్డి, స్వర్ణాకర్, నాగేంద్రబాబు, శ్రీలక్ష్మి, రాము, వేణు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టింపేది..?

- నిర్వీర్యమవుతున్న పల్లె ప్రకృతి వనాలు
- పథకాలు పేరుతో ప్రభుత్వ ధనం వృథా
- పట్టించుకోని పంచాయతీలు



కట్టకూరు సమీపంలో ఎండిన మొక్కలతో ఉన్న పల్లె ప్రకృతి వనం



చిరుమర్రిలో గుట్టల మధ్యన ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం

ముదిగొండ: పల్లెలో ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఏదో ఊరికి దూరంగా హడావుడిగా ఏర్పాటు చేసి వదిలేయడంతో మైదాన ప్రాంతాలుగా మారిపోయి కనిపిస్తున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో పల్లె వనాలపై పట్టింపే లేకుండా పోతోంది. ప్రభుత్వం వీటితో పాటుగా వన నర్సరీలు, తడి, పొడి చెత్తను వేరుచేయు షెడ్లులు, డంపింగ్ యార్డులు, వైకుంఠ ధామాలు కూడా రూ.లక్షల్లో ఖర్చు చేసి నిర్మాణాలు చేపట్టినా ఉపయోగం లేకుండా పోతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం నెరవేరడం లేదు. దీనికి మండలంలోని చిరుమర్రి, కట్టకూరు, వల్లభి పంచాయతీల్లో చేపట్టిన అభివృద్ధి పనులే దీనికి నిదర్శనం.

ముదిగొండ మండలంలోని చిరుమర్రి గ్రామంలో మొత్తం 2,749మంది ఉండగా, 10వార్డుల్లో 2,023మంది ఓటర్లున్నారు. ప్రతీ పంచాయతీలాగానే ఇక్కడ కూడా పల్లెప్రకృతి వనం, చెత్తను వేరు చేసే షెడ్డు, వైకుంఠధామాలను నిర్మించారు. చెత్తను వేరు చేయడానికి ప్రతి వస్తువుకి ఒక విభాగాన్ని ఏర్పాటు చేశారు. అందులో ఎలాంటి చెత్తను సేకరించిన దాఖలాలు లేవు. షెడ్డు నిరుపయోగంగా ఉంది. ఇక శ్మశాన వాటిక చుట్టూ ప్రహరీ లేక బోసిపోయి ఉంది, కనీసం మొక్కలు నాటిన పాపానా పోలేదు. చెరువుకట్టకు దిగువన ఉన్న ఈ వైకుంఠధామంలో సరైనా వసతులు లేక కర్మకాండలకు వచ్చే వారు పలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఫెన్సింగ్ లేదు, మొక్కలు నాటలేదు, రోడ్డుకు కిందకు ఉండటంతో వర్షాలకు ఇబ్బందులు పడుతున్నారు. పల్లెప్రకృతి వనం ఊరికి మూడు కిలోమీటర్ల ఆమడ దూరంలో గుట్టల మధ్యన ఉండడంతో అక్కడ నిరుపయోగంగా ఉంది. ఉదయం సాయంత్రం నడిచే వారే లేకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగిపోతున్నాయి. ఆహ్లాదకరాన్ని పంచుకునేవారే లేరు.

వల్లభిలో..

వల్లభిలో వైకుంఠధామంలో అన్ని సౌకర్యాలున్నా, అక్కడా మొక్కల సంరక్షణ కరువైంది. చెత్తా చెదారంతో నిండుకొని ఉంది. ఉన్న అలంకార చెట్లు, మొక్కలు చుట్టూ పాదులు లేక, నీరు లేక వడబడిపోతున్నాయి. కొన్ని మొక్కలు ఎండిపోతున్నాయి. ఇక్కడి వననర్సరీ బాణాపురం – వల్లభి సరిహద్దులో నాలుగు కిలో మీటర్ల దూరంలో నిర్మించారు. ఇది ప్రజలకు అలంకారప్రాయంగానే ఉంది. చెత్త డంపింగ్ యార్డు పూర్తిగా కనిపించకుండా నిండిపోయి ఉంది. చెరువుకట్టపైనే చెత్తను వేసి అగ్గిపాలు చేస్తున్నారు.

కట్టకూరులో..

కట్టకూరు గ్రామపంచాయతీలో పల్లెప్రకృతి వనం, వననర్సరీ పూర్తిగా మొక్కలు ఎండి ఉన్నాయి. చెరువు సమీపంలో ఉన్న నేల అనుకూలించకపోవడంతో మొదటి నుంచి అక్కడ ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం జనాలకు ఎన్నడూ ఉపయోగపడలేదు. దీంతో ఇక్కడ కూడా ఈ పథకాలు నిరుపయోగంగా మారాయి. ఇంకా ఇలాంటి గ్రామాలు చాలా ఉన్నాయి.

ప్రజలకు ఉపయోగం లేదు..



రూ.లక్షలు వెచ్చించి ప్రభుత్వ పథకాల ద్వారా నిర్మించిన పల్లె ప్రకృతి వనాలు ప్రజలకు ఉపయోగపడేలా చేస్తే మేలు. విలువైన ప్రభుత్వ భూముల్లో ప్రజలకు ఉపయోగం లేకుండా గ్రామాలకు దూరంగా ఉన్నాయి. ఉపయోగపడే విధంగా పథకాలు రూపకల్పన చేయాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది.

– బిచ్చాల బిక్షం, ఎంపీటీసీ సభ్యుడు, వల్లభి

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం..



రెవెన్యూశాఖ అధికారులు ప్రభుత్వ భూములు చూపించి తీర్మానాలు చేశాకే పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశాం. వాటి వినియోగించుకోవాలని ప్రజలకు సూచించాం. ఉన్నతాధికారుల దిశా నిర్దేశాలను అనుసరిస్తు ముందుకు తీసుకెళ్లుతున్నాం. ప్రభుత్వ ఆదేశాను సారం ఎక్కడా ఎవరికి ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం.

– శ్రీనివాస్‌రావు, ఎంపీడీఓ, ముదిగొండ

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ముదిగొండ : గోకినేపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్

ముదిగొండ: రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు సూచించారు. మండలంలోని గోకినేపల్లిలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. దళారుల చేతుల్లో రైతులు మోసపోకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేస్తోందని చెప్పారు. తద్వారా రైతులకు మద్దతు ధర లభిస్తుందని తెలిపారు. ఎంపీపీ సామినేని హరిప్రసాద్, జెడ్పీటీసీ పసుపులేటి దుర్గ, సర్పంచ్ గుగులోతు క్రాంతితో పాటు పొట్ల ప్రసాద్, మీగడ శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మారెడ్డి, వెంకట్‌గౌడ్, పాల్గొన్నారు.

వేంసూరు: రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తూ.. తెలంగాణ ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని వేంసూరు ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఐకేపీ ఆధ్వర్యాన మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఐకేపీ ఏపీఎం బొమ్మ శ్రీనివాస్, సీసీలు చెన్నారావు, ప్రసాద్, సీడీసీ డైరెక్టర్ పుచ్చకాయల శంకర్‌రెడ్డి, సర్పంచ్‌లు, నాయకులు గాయం సద్గుణవతి, గరిగంటి మౌనిక, కుక్కపల్లి సుధాకర్, గండా వెంకటరమణ, నాయకులు దొడ్డా వెంకటకృష్ణారెడ్డి, గడిపర్తి శ్రీనివాసరావు, పదిలం సాయిబాబు, గరిగంటి రాంబాబు, గాయం రాంబాబు, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సత్తుపల్లిరూరల్: మండలంలోని సదాశివునిపాలెం, రామానగరం, కిష్టారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంపీపీ దొడ్డా హైమావతి, సర్పంచ్‌లు తుంబూరు సరస్వతి, వేల్పుల కళావతి, చెట్టుమాల రేణుక ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొందాలన్నారు. ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, ఎంపీటీసీ మోరంపూడి అరుణ, పాలకుర్తి సునీత, చంద్రశేఖర్, ఏఈఓ ఆశాజ్యోతితో పాటు రైతులు, నాయకులు పాల్గొన్నారు.

కల్లూరు రూరల్: మండలంలోని బత్తుల పల్లి, లక్ష్మీపురం, కొర్లగూడెం గ్రామ పంచాయతీలలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సర్పంచ్‌లు శీలం సత్యనారాయణరెడ్డి, బైరెడ్డి నర్సింహారెడ్డి, గుగులోత్ లక్ష్మి ఐకేపీ, ఏపీఎం వెంకటరామారావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఈఓ వెంకటరమణ, కొనుగోలు కమిటీ సభ్యులు విజయ, కృష్ణ, శ్రీనివాసరెడ్డి, కృష్ణకుమారి, రమాదేవి, నాగమణి, శైలజ, స్వాతి, కమ్యూనిటీ కోఆర్డినేటర్ వెంకట్రావమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంట అవశేషాలను కాల్చకండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రాధ

బోనకల్/ముదిగొండ: మొక్కజొన్న, వరి కోత అనంతరం మిగిలిన అవశేషాలను కాల్చకుండా నేలలో కలియదున్నడం ద్వారా మంచి ఫలితాలు పొందొచ్చని బోనకల్, ముదిగొండ ఏఓలు అబ్బూరి శరత్‌బాబు, రాధ రైతులకు సూచించారు. ఆయా మండలాల్లో పలు గ్రామాల్లో రైతులకు సోమవారం వారు అవగాహన కల్పించారు. పంట అనంతరం అవశేషాలను తగలబెట్టడం ద్వారా నేలకు మేలు చేసే క్రిమికీటకాలు నశిండమే కాక భూసారం తగ్గిపోతుందన్నారు. అలాగే, అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశముందని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో ఏఈఓలు సాధన, కల్యాణి, గోపి, నాగసాయి తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే



తెల్లపాలెంలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రుపాలెం: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీయే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా తెల్లపాలెం గ్రామంలో మండల కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పలువురు నాయకులతో కలిసి ఇంటింటికీ తిరిగి కరపత్రాల అందించారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహారావు, శ్రీనివాసరావు, వెంకటనర్సయ్య, పాండు రంగారావు, బాబురావు, జనార్దన్, పూర్ణ, రాజేష్, చెన్నయ్య పాల్గొన్నారు.

గ్రామస్థాయిలో వైఎస్సార్ టీపీ బలోపేతం

కారేపల్లి: గ్రామస్థాయిలో వైఎస్‌ఆర్ టీపీ బలోపేతమే లక్ష్యంగా.. గడప గడపకు వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీ కార్యక్రమం ముమ్మరంగా నడుస్తుందని వైఎస్‌ఆర్ టీపీ జిల్లా నాయకుడు ధరంసోత్ రాము నాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా.. సోమవారం కారేపల్లి మండలంలోని మాణిక్యారం, రూప్లాతండా, ఒడ్డుగూడెం, రేలకాయలపల్లి, పంతుల్‌నాయక్‌తండా, టేకులగూడెం, తొడితలగూడెం గ్రామాల్లో నాయకులు పర్యటించి, గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రామునాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి సాధించాలంటే వైఎస్‌ఆర్ తెలంగాణ పార్టీని బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాసరావు, వీరన్న, రియాజ్, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కృషి చేయాలి

చింతకాని: టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర నాయకుడు, మధిర నియోజకవర్గ సమన్వయకర్త వాసిరెడ్డి రామనాథం కార్యకర్తలకు సూచించారు. మండలంలోని చింతకాని, నర్సింహాపురం గ్రామాల్లో సోమవారం రాత్రి ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో పార్టీ సభ్యత్వాలను అధిక సంఖ్యలో చేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నున్నా తాజుద్దీన్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, నాయకులు గోపాలరావు, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, సురేష్, నగేష్ పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి



అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

వైరా: మండలంలోని గరికపాడు సొసైటీలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తక్షణమే ప్రారంభించాలని కోరుతూ రైతు సంఘం నాయకులు సోమవారం అదనపు కలెక్టర్ మధుసూదన్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడారు. వాతావరణ మార్పుల దృష్ట్యా ప్రభుత్వం త్వరగా కొనుగోలుకేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చలపతిరావు, కృష్ణ, కుటుంబరావు, శ్రీనివాసరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటేశ్వరరావుకు పలువురి నివాళి



వెంకటేశ్వరరావు కుటుంబీకులను పరామర్శిస్తున్న నాయకులు

సత్తుపల్లిరూరల్: మండలంలోని కొత్తూరుకు చెందిన నరుకుళ్ల వెంకటేశ్వరరావు ఇటీవల మృతి చెందగా పలువురు ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు. అలాగే, ఆత్మ, మున్సిపల్, గ్రంథాలయ సంస్థ చైర్మన్లు వనమా వాసు, కూసంపూడి మహేష్, కొత్తూరు ఉమామహేశ్వరరావు, సర్పంచ్ ఒగ్గు విజయలక్ష్మి, శ్రీనివాసరెడ్డి, నరేందర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కూరపాటి వెంకటేశ్వర్లు తదితరులు వెంకటేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

మట్టూరి వీరయ్యకు..

వైరారూరల్: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన స్వాతంత్ర సమరయోధుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మట్టూరి వీరయ్య దశదినకర్మ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాలోత్ రాందాస్ నాయక్, దాసరి దానియేలు, వెంకటేశ్వర్లు, నర్సింహారావు, వెంకటేశ్వర్లు, రాంబాబు, చలపతిరావు, బీడీకే రత్నం తదితరులు పాల్గొని మట్టూరి వీరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



వీరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రంజాన్ తోఫా పంపిణీ

సత్తుపల్లిరూరల్: పవిత్ర రంజాన్ పండుగను ప్రతి ముస్లిం సోదరులు సంతోషంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య తెలిపారు. సోమవారం మండలంలోని కాకర్లపల్లి గ్రామంలో పేద ముస్లింలకు ప్రభుత్వం అందిస్తున్న రంజాన్ తోఫా, నిత్యావసరాలను ఎమ్మెల్యే సర్పంచ్ రమాదేవితో కలసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రంజాన్ పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం కులమతాలకతీతంగా సంక్షేమ ఫలాలను అందిస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో మూడోసారి కూడా విజయం సాధించడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డా హైమావతి, ఉపసర్పంచ్ ఏగోటి పెద్దిరాజు, ఎంపీటీసీ పుష్పావతి, ఆత్మకమిటీ చైర్మన్ వనమా వాసు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొత్తూరు ఉమా, ఎస్‌కే రఫీ, పరిమి వెంకటేశ్వరరావు, కంచర్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.



రంజాన్ తోఫా అందిస్తున్న ఎమ్మెల్యే వెంకటవీరయ్య

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లోని ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేసిన రంజాన్ తోఫాను సోమవారం మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అందించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్‌కే ఛాంద్‌పాషా, కోఆప్షన్ సభ్యుడు తడికమళ్ల ప్రకాశరావు, మసీద్ కమిటీ సభ్యులు మిర్జాసర్దార్ బేగ్, మైబు, మదీనాపాషా, భాషా, జిన్ని, జాని, సత్తార్‌పాషా, జిలానీ, మస్తాన్ పాల్గొన్నారు.

ముస్లింలకు ఇఫ్తార్ విందు



సత్తుపల్లి: ముస్లింలకు భోజనం వడ్డిస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి/మధిర/వేంసూరు/కల్లూరు/ఎర్రుపాలెం: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని సోమవారం ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేసింది. సత్తుపల్లి జామే మసీద్‌లో, పట్టణంలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యాన ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. మధిరలోని రాయపట్నం సెంటర్లోగల మసీదులో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు, వేంసూరులోని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇఫ్తార్ విందులో పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కల్లూరులోని జామే మసీదులో ప్రభుత్వం అందించే ఇఫ్తార్ విందు ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య ముస్లింలకు ఇచ్చారు. ముందస్తుగా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఎర్రుపాలెం మండలంలోని షాదీఖానా భవనంలో మజీద్ కమిటీ ఆధ్వర్యంలో నిరుపేద ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమాలల్లో ఏసీపీ రామనుజం, సీఐ హనూక్, తహసీల్దార్ బాబ్జిప్రసాద్, జెడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్, రైతు సమితి మండల కన్వీనర్ రఘు, జిల్లా కమిటీ సభ్యుడు చందర్‌రావు, సొసైటీ చైర్మన్ లక్ష్మణరావు, ముస్లిం మండల కమిటీ సదర్ సయ్యద్ అలీ, జామియా మసీదు సదర్ ఇమామ్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఇస్మాయిల్, ఎస్‌కే కమ్లి, అమీరుద్దీన్, ఇషాక్, ముజాహిద్, హనీఫ్, సర్పంచ్ ఎండీ ఫైజుద్దీన్, ఇమామ్ పాషా, సుబాని, కోటేశ్వరరావు, బండి గురునాథరెడ్డి, ఎంపీపీ దేవరకొండ శిరీష, సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ మస్తాన్‌వలీ, షేక్ బాబుసా, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సాంబశివరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మజీద్ కమిటీ సభ్యులు ఇస్మాయిల్, మౌలాలి, ఇమాంసాహెబ్, బాబుసా, షంషుద్దీన్, లాలు, అన్వర్, మస్తాన్, తురాబ్ అలీ, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయబాబు, సదర్ ముఖరం హుస్సేన్, నాయకులు నాయకులు జూరె ఆదినారాయణ, ఎం.డీ.కమల్‌పాషా, మందపాటి ముత్తారెడ్డి, మలిరెడ్డి మురళీరెడ్డి, తోట గణేష్, మందపాటి రవీందర్‌రెడ్డి, రహ్మత్‌పాషా, రహీం, దూదిపాల రాంబాబు, రాజేష్, అట్లూరి సత్యనారాయణరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రముఖులు, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



వేంసూరు: ఇఫ్తార్ విందులో పాల్గొన్న తుమ్మల

పలు కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

కల్లూరు: పట్టణంలో పలు కుటుంబాలను ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. సోమవారం డాక్టర్ రాధాకృష్ణమూర్తి హాస్పటల్ రోడ్డులో ఉన్న ముత్తయ్య కుటుంబాన్ని, అంబేడ్కర్ నగర్‌కు చెందిన జి.వివేక్ కుంటుంబ సభ్యులను, శాంతినగర్‌కు చెందిన పలు కుటుంబాలను పరామర్శించి మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో రైతు సమితి మండల కన్వీనర్ రఘు, జిల్లా కమిటీ సభ్యుడు చందర్‌రావు, బీఆర్‌ఎస్ మండల కార్యదర్శి ప్రసాద్, ఎంపీటీసీ కిరణ్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పూర్తి చేయండి..

కల్లూరు రూరల్: మండలంలోని చెన్నూరు – పెద్ద కోరుకొండి గ్రామాల మధ్య విశాల ప్రదేశంలో ఈ నెల 19న జరుగనున్న బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కోరారు. సోమవారం సమ్మేళన ప్రదేశాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పాలెపు రామారావు, జెడ్పీటీసీ సభ్యులు అజయ్‌కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ వెంకటేశ్వరావు, రామకృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ లక్ష్మణరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి: సుచిరిండియా ఫౌండేషన్ నిర్వహించిన సీవీ రామన్ 30వ రాష్ట్ర స్థాయి ఒలింపియాడ్‌లో సత్తుపల్లి వీవీ విద్యాలయం విద్యార్థులు ప్రతిభ చూపారు. ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సీఈఓ డాక్టర్ కిరణ్, నటుడు ఆదిశేషు చేతుల మీదుగా బహుమతులు అందుకున్నారు.

ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థులను కరస్పాండెంట్ భగవాన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

తల్లాడ: మండలంలోని అన్నారుగూడెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం అన్నారుగూడెం సర్పంచ్ మారెళ్ల మమత శంకుస్థాపన చేశారు. ఎస్‌డీఎఫ్ నిధులతో సీసీ రోడ్డు నిర్మించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ గోవింద్ విజయమ్మ, కార్యదర్శి వేణు, నరసింహారావు, భవాణి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రారంభం



కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీనివాసరావు

తల్లాడ: మండలంలోని కేశ్వాపురం గ్రామంలో సోమవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ వనగండ్ల అలేఖ్య అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ.. తెలంగాణా ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే లక్ష్యంలో ఈ శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ శిబిరంలో ఉచితంగా కంటి పరీక్షలు చేసి అవసరమైన వారికి కళ్ల అద్దాలను అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఇబ్రాయిల్, చిన్నం శెట్టి పద్మ, నాగమణి, గ్రామ కార్యదర్శి సైదులు, దీపిక, అప్పారావు, శేషగిరిరావు, రాఘవులు, గోపాల్‌రావు, విజయలక్ష్మి, దేవదానం పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

ఇష్టారీతిన తవ్వకాలు

ముదిగొండ మండలంలోని వల్లభి నుంచి న్యూలక్ష్మీపురం వరకు 25కిలో మీటర్ల మేర గ్యాస్‌లైన్ పైపుల కోసం ఆర్‌అండ్‌బీ రోడ్డును యంత్రాలతో ఇష్టమొచ్చినట్లు తవ్వారు. ఇటీవల బాణాపురంలో ప్రధాన ఆర్‌అండ్‌బీ రోడ్డును తవ్వడంతో మంచినీటి పైపులు పగిలి నీటి సరఫరా ఆగిపోయింది. పదిరోజుల పాటు వాటిని సరిచేసి పూడ్చివేశారు. అలాగే కమలాపురంలో కూడా ఇందే తంతు. ఇలా ఇష్టమొచ్చినట్లు తవ్వకాలు జరిపి తవ్విన మట్టిని రోడ్డుపై పోస్తున్నారు. దీంతో వాహనదారులు రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులకు గురౌతున్నారు. కావున అధికారులు, ఆర్‌అండ్‌బీ అధికారులు చొరవ చూపి తవ్వకాల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి మంచినీటి సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

– ముదిగొండ



ప్రశ్నించాల్సిన అధికారి : రాజేష్, ఆర్‌అండ్‌బీ ఏఈ, మధిర
సెల్ నంబర్ : 9441055478